ఏఐటీయూసీ జిల్లా మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా మహాసభల గోడపత్రికను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాంద్రేగుల సత్యాంజనేయ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా మహాసభలు ఈనెల 12, 13 తేదీలలో జరగనున్నాయని, ఈ జిల్లా మహాసభకు ట్రేడ్ యూనియన్ నాయకులు, అసంఘటిత కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 12వ తేదీ ఉదయం 10 గంటలకు సరస్వతి పార్కు నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనకు ఏఐటీయూసీ విశాఖ జిల్లా కార్యవర్గం, వీధి విక్రయదారులు, ఆటో కార్మికులు, మున్సిపల్ కార్మికులు, తోపుడుబండ్ల కార్మికులు పాల్గొని ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ గుర్తింపు యూనియన్ ఉపాధ్యక్షులు బి.హరినాథ్, కోరమండల్ కాంటాక్ట్ లేబర్ యూనియన్ కార్యదర్శి సత్తిబాబు, కోలాట శంకర్రావు, బీహెచ్‌పీవీ నుంచి గండి అప్పారావు, సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, బి.సత్యనారాయణ, ఎన్వి త్రినాథ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్ అభివృద్ధికి సహకరిద్దాం

మేయర్ హరి వెంకట కుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పర్యావరణ హిత నగరంగా విశాఖను తీర్చిదిద్దడమే జీవీఎంసీ లక్ష్యంగా ఆ దిశగా 'ఎకో వైజాగ్' అనే బృహత్తర కార్యక్రమాన్ని జీవీఎంసీ 5 అంశాలతో ప్రణాళికలను రూపొందించిందని, నగర ప్రజలందరూ ఎకో వైజాగ్ అభివృద్ధికి సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి అన్నారు. ఆదివారం ఆర్కే బీచ్ సమీపంలో స్పిరిట్ ఆఫ్ వైజాగ్ ఆర్గనైజేషన్ వారు ఏర్పాటు చేసిన "హ్యాండ్లూమ్ శారీ వాక్" కార్యక్రమంలో అర్జున అవార్డు, పద్మశ్రీ పురస్కార గ్రహీత కరణం మల్లేశ్వరితో కలసి ముఖ్యఅతిథిగా నగర మేయర్ పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ముందుగా అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "హ్యాండ్లూమ్ శారీ వాక్" అనే బృహత్తర కార్యక్రమాన్ని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ ఆర్గనైజేషన్ వారు ఏర్పాటు చేసి ఒక మంచి సంస్కృతికి శ్రీకారం చుట్టినందుకు ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సి.హెచ్ దొర బాబుకి మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ శారీ వాక్‌లో విశాఖ నగర నారీమణులు చేనేత వస్త్రాలను ధరించి పాల్గొని, చేనేత వస్త్రాలను ధరించాలనే నినాదంతో దేశమంతా తెలిసేటట్లు చాటినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుటకు జీవీఎంసీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2022లో దేశంలోనే మన నగరం నాలుగవ పరిశుభ్ర నగరంగా ఖ్యాతిని పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో కరణం మల్లేశ్వరి, స్పిరిట్ ఆఫ్ వైజాగ్ ప్రెసిడెంట్ సిహెచ్ దొరబాబు, సుధా పద్మశ్రీ, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దింటి ఉషాశ్రీ, సీఎమ్మార్ అధినేత మావూరి వెంకటరమణ కుమార్తె మానస తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను అణగదొక్కేందుకే పోలీస్ యాక్ట్-30

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నారా చంద్రబాబు నాయుడు రోడ్డు షోలకు, నారా లోకేష్ యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే జగన్ రెడ్డి పోలీసు యాక్టుల పేరుతో అడ్డుకుంటున్నారని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జీవో 1, పోలీసు యాక్టు 30లు అమలు చేస్తున్నారని అన్నారు. జగన్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రజాసమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాల గొంతులను అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి అవినీతి, అరాచకాలు బయట పడతాయనే పోలీసులతో ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. ఆంధ్రాలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన పోలీసు యాక్టుపై సుప్రీం కోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ గూండాలు, రౌడీలు ఆంధ్ర రాష్ట్రాన్ని మణిపూర్‌లా మారుస్తున్నారని ఆరోపించారు. ఎన్ని పరిస్థితులు ఎదురైనా భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

గతంలో వైకాపా ప్రభుత్వం నిరంకుశంగా తీసుకువచ్చిన జీవో 1ను సుప్రీం కోర్టు కొట్టివేసిందని, అయినా జగన్ రెడ్డి మూర్ఖత్వంగా ప్రవర్తిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియజకవర్గ పరిశీలకులు బొర్రా నాగరాజు, రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు మాధంశెట్టి నీలబాబు, బి.జోగి నాయుడు, పొలరపు త్రినాథ్, వచ్చికూర రాము, సిరసపల్లి సన్యాసి రావు, కొణతాల రత్న కుమారి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, సబ్బవరపు గణేష్, ఆళ్ళ రామచంద్రారావు, సేనాపతి స్వరూపా, కాంద్రేగుల సతీశ్ కుమార్, పల్లెల నాగేశ్వరరావు, పిట్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

9న ఆదివాసి హక్కుల దినంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - అరకులోయ: ఈనెల 1వ తేదీ నుండి 10 తేది వరకు ఆదివాసి హక్కుల దినోత్సవంగా రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని ఆదివాసి గిరిజన సంఘం పిలుపుమేరకు ఈనెల 9వ తేదీన ఆదివాసి హక్కుల దినంగా జరుపుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం మండలంలోని సరభగుడ గ్రామంలో మండల నాయకులు కె.మగ్గన్న అధ్యక్షతన ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ఆదివాసి గిరిజన సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసి హక్కులు, చట్టాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు ప్రపంచ ఐక్యరాజ్య సమితి డిక్లరేషన్ చేసి నేటికీ 29 సంవత్సరాలు గడుస్తున్న నేటికీ భారతదేశంలో ప్రభుత్వాలు అమలుకు నిరాకరిస్తున్నాయని ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 700 ఆదివాసి తెగలు 75 ఆదిమ జాతి తెగల హక్కులు గుర్తించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరాకరిస్తుందని, అడవులపై ఆదివాసులు సాధించిన హక్కులు తొలగించి కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆదివాసులపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా పాల్పడుతుందని, బోయ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేరుస్తామని, అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంట్లో ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 20 రకాల ప్రభుత్వ శాఖలో ఉద్యోగ ఉపాధి కల్పించే జీవో నెంబర్ 3 రద్దు చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్న పార్లమెంట్లో కనీసం మాట్లాడకపోవడం ఆదివాసులపై వైసీపీ ప్రభుత్వ కపట ప్రేమ బయట పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసులకు తీవ్ర నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కిలో సహదేవ్, పి.రాము, కిల్లో కేశవ్, మహేష్, కార్తీక్ సాయి, లక్ష్మణ్, విష్ణు, కళ్యాణ్, రాంబాబు, కొండబాబు, కొర్రా ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముతా కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలో 14 గ్రామాల్లోని సుమారు 7వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించే ముతా కాలువలో ఎట్టకేలకు పూడికతీత పనులు ప్రారంభించినట్లు శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్ తెలిపారు. ముతాకాలువలో పూడికలు తీయాలని రైతులు, ప్రజాప్రతినిధులు పదే పదే అధికారులను కోరుతూ వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కాలువల్లో పూడిక తీసేందుకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. సుమారు 5ఏళ్లుగా పూడికలు తీయకపోవడంతో తుని మున్సిపాలిటీ మురికినీరు కాలువలో చేరి సాగునీటి కాలువ మురికి కాలువను తలపిస్తుందని తెలిపారు. మండలంలోని కేశవరం సమీపంలోని దక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమ పూడిక తీసేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. పరిశ్రమ సీఎస్ఆర్ ఫండ్స్‌తో పూడికతీత పనులు ప్రారంభించారని తెలిపారు. ఈకార్యక్రమంలో కేశవరం సర్పంచ్ మేడిశెట్టి రామగోవిందు, గంగిరెడ్ల లోవబాబు, అవతారం రాజు, గంగిరెడ్ల బుజ్జి, కొండబాబు, గొర్ల రాజు, మోకిన రాజబాబు, పులగల భద్రరావు, ముప్పిన శ్రీను, బొగ్గు బాబ్జి పాల్గొన్నారు.

బాబు రాజకీయ లబ్ధి కోసమే కుటిల రాజకీయం

అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ

విశాలాంధ్ర - యస్.రాయవరం: రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలు చేస్తున్నాడని అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. ఆదివారం మండలంలోని కొరుప్రోలు గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పర్యటిస్తూ హింసను ప్రేరేపి స్తున్నారని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఆయన పర్యటించినప్పుడు పుంగనూరులోని జరిగిన ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలు దాడుల్లోని సుమారు 40 మందికి పైగా పోలీసులకు గాయాలు అవ్వడం బాధాకరమని ఈ దాడుల వెనక ఉన్న చంద్రబాబు నాయుడుపై కఠిన చర్యలు తీసుకునే విధంగా పోలీసులు కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమం గురించి జీర్ణించుకోలేక చంద్ర బాబు నాయుడు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ సీనియర్ నాయకులు మాతా గురు నాథరావు, పోలిశెట్టి పెద ఈశ్వర్‌రావు, సీరం నరసింహమూర్తి, బొల్లం చలపతిరావు, అల్లాడ నాగరాజు, శ్రీపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - మల్కాపురం: గాంధీ గ్రామ్ శాఖ షిప్ యార్డ్ కార్మికులతో షిప్ యార్డ్ కాలనీలో సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంద్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, ఎన్వి త్రినాథ్, బి.హరినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీ నంలోనే ఉంచాలని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ చేతుల్లో పెడితే ఊరుకోమని ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ ఉక్కు మెయిన్ గేటు వద్ద ఉదయం 10 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, రైల్వే జోన్ ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని తదితర డిమాండ్లతో బస్సు యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు.

తక్షణమే నిత్యావసర వస్తువులు ధరలు, విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లిలో గల దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ నీటిమూటలగానే మిగిలిపోయిం దన్నారు. జిల్లాలో ఎస్ఈజెడ్, ఫార్మా, ఇతర కంపెనీల్లో నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి కల్పించడం లేదని అన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు విద్యార్హత ప్రకారం 75 శాతం ఉద్యోగాలు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతియేటా ఇయర్ క్యాలెండర్ వేసి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులకు మొండి చేయి చూపిందన్నారు. ఈ సందర్భంగా 12 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్.శివాజీ, ఎస్.వి.నాయుడులతో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా అల్లు రాజు, సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణరావు, శివలను ఎన్నుకున్నారు.

గద్దర్ మృతికి సంతాపం



విశాలాంధ్ర - విశాఖ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ అకాల మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా నాయకులు కామ్రేడ్ పి కృష్ణ, కామ్రేడ్ జి కాసుల రెడ్డి, బి శివ, ఎస్ అప్పారావు, బి చిరంజీవి, కె.రమణ, దేవుడమ్మ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సీపీఐ అనకాపల్లి జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విడుదల చేశారు. బడుగు, బలహీన వర్గాలను చైతన్యపర్చడానికి తన కళలతో కృషి చేశారని అన్నారు. ఆయన పాట ఎప్పుడూ సామాజిక సమస్యలపై, ఉద్యమాలపై ఉగ్రూతలూగించాలే వుండేవన్నారు. జానపద కళా రూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారన్నారు. సామాజిక మార్పు కోసం తపన పడ్డారని, ఇందుకోసం నిర్బంధాన్ని సైతం అనుభవించారన్నారు. ఆయన మృతి అభ్యుదయ సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారత్ దేశంలోనే జానపదానికి, ప్రజా సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది గద్దరేనని, నిజమైన ప్రజా కళాకారుడు, గర్భస్థ మేధావి అని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.యస్.చలం అన్నారు. గతంలో బి ఎస్ పి సమావేశానికి విశాఖ వచ్చిన సందర్భంగా గౌతు లచ్చన్నతో కలిసిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన రచనలు పాటలకు అంతర్జాతీయ గుర్తింపు రావలసిన వుందన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.



పుంగనూరు టీడీపీ ఘటన పెద్ద కుట్ర

విశాలాంధ్ర - జి.మాడుగుల: పుంగనూరులో పచ్చమంద సృష్టించిన రాక్షస క్రీడ వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని వైసీపీ జి.మాడుగుల శ్రేణులు తీవ్రస్థాయిలో ఆరోపించాయి. పుంగునూరు ఘటనపై ఆదివారం జి.మాడుగుల వైసీపీ మండల అధ్యక్షులు నుర్మని మత్స్య కొండం నాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర, జి.మాడుగుల ఎంపీటీసీ మత్స్యరాస విజయ కుమారి, సింగర్భ సర్పంచ్ మసాడి గంగరాజు, సింగర్భ ఎంపీటీసీ పాంగి చిట్టిబాబు, సొలభం ఎంపీటీసీ కూడా చిన్నారావు, వంజరి ఎంపీటీసీ వంతల అచ్చిబాబు తదితరులు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులు చూస్తున్నారన్నారు. రాజకీయ అవసరాల కోసం చంద్ర బాబు ఎంత నీచానికైనా దిగజారు తారనేందుకు ఈ ఘటనే ప్రత్యక్ష సాక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ సాగేని లక్ష్మిపడాల్, సింగర్భ సచివాలయం కన్వీనర్ వండ్లబు సూర్యప్రకాష్ నాయుడు, గెమ్మెలి సచివాలయం కన్వీనర్లు బోనంగి బాలయ్యపడాల్, తూబురు బాలన్న, వార్డు మెంబర్ మంజెలి మాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అప్సా కార్యదర్శిగా భాస్కరరావు

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో పాతగాజువాక యశోదా విద్యానికేతన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు పాఠశాల సంఘం (అప్సా) రాష్ట్ర చైర్మన్ వి.సుందరరాం ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరై ప్రసంగించారు. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలల సమస్యలు వాటి పరిష్కార మార్గాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన జిప్సా యొక్క గొప్పతనం సంఘం పటిష్టతకు వివరించారు. జిప్సా అధ్యక్షుడుగా ఉన్న పాలవలస భాస్కరరావు సేవలు జిల్లా అంతటికీ అవసరమై ఉన్న కారణంగా సమావేశంలో పాల్గొన్న అందరి సభ్యుల ఏకాభిప్రాయం మేరకు భాస్కరరావుని విశాఖ జిల్లా ప్రైవేటే పాఠశాలల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా జిప్సా సభ్యులంతా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జనార్దన్, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, శోభన్ బాబు, జగ్గారావు, వాసు, జగన్, బాబురావు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పవన్ వారాహి యాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు చేపట్టనున్న వారాహి యాత్రను విజయవంతం చేయాలని జనసేన పార్టీ భీమిలి ఇన్‌చార్జ్ సందీప్ వంచకర్ల పేర్కొన్నారు. ఆదివారం ఆనందపురం రూరల్ పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల జనసైనికులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడారు. ఈ యాత్రలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు జనవాణి కార్యక్రమం చేపడతారన్నారు. పవన్ కల్యాణ్‌కు విశాఖతో విడదీయ రాని బంధం ఉందని, ఆయనకు నటనలో పాఠాలు నేర్పిన గురువుది విశాఖ నగరమే అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియో జకవర్గం నాయకులు శాఖరి శ్రీనుబాబు, బూత్ కన్వీనర్ చంద్రరావు, సమన్వయకర్త కృష్ణయ్య, మీడియో సమన్వయ కర్త ఎస్.ఎస్. నాయుడు, పరిమి భువనేశ్వరి, కుప్ప రామలక్ష్మి, ఆనందపురం మండల కో ఆర్డినేటర్ సభ్యులు దుక్క వెంకట్, శివకృష్ణ, బంగారు నాయుడు, డాక్టర్ పిన్నింటి నాయుడు, మూర్తి, గోవింద, అప్పల రాజు, బాలు, జనసేన నాయకులు రాజు, కృష్ణ, కిరణ, రాజు, మీసాల నాగేశ్వరరావు, ప్రశాంత్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర - భీమిలి: ఆనందపురం మండలంలో పొడుగుపాలెం పరిసర ప్రాంతాలకు ఇలవేల్పు అయిన శ్రీశ్రీశ్రీ భూలోక మాత అమ్మవారు ఉత్సవాలు ప్రతి మూడు సంవత్సరములకు ఒకసారి జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి పసుపు, కుంకుమలు, ధూప, దీప, నైవేద్యములతో అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులకు పతకాలు

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం స్పోర్ట్స్ కరాటే ఆధ్వర్యంలో స్వర్ణ భారతి స్టేడియంలో 21వ రాష్ట్ర కరాటే ఛాంపియన్ షిప్‌ను నిర్వహించారు. ఆనందపురం గ్రామంలో గల జడ్పీహెచ్ హైస్కూల్‌లో కరాటే విక్టరీ షూటోకాన్ కరాటే అకాడమీ కోచ్ సాయి కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న కుప్ప రేవంత్ కుమార్(6) కథ విభాగంలో గోల్డ్ మెడల్, కుంతీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. టి.సాత్విక్ (5) రెండు గోల్డ్ మెడల్స్, కె.ప్రసాద్ కథ విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. ఈ పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన కుప్ప రేవంత్ కుమార్, టి.సాత్విక్‌లు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో కేరళలో సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని కోచ్ సాయి కుమార్ తెలిపారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఆలయ ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునీల్ ఆధ్వర్యంలో వేద పండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ వేకువ జామున సింహాద్రి నాధుని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. తొలుత స్వర్ణ పుష్పార్చన, పిదప శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి నిత్య కల్యాణం, అనంతరం గరుడ వారి వేదికపై స్వామి వారిని అధిష్టింపజేసి వేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ వి.కల్యాణి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

మత్స్యకారులకు అండగా నిలిచిన మంత్రి సీదిరి

విశాలాంధ్ర - పాయకరావుపేట: బాపట్ల జిల్లా రామాపురం గ్రామంలో మత్స్యకారులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చలించిపోయి వారికి అండగా నిలిచారని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు తెలిపారు. మంత్రి అప్పలరాజు ఆదేశాల మేరకు బాపట్ల ఎస్పీ విచారణ కమిటీ వేసినందుకు మోసా అప్పలరాజు ఎస్పీని కలిసి సంఘటన అంశాలను వివరించారు. బాధిత మత్స్యకారుల సమస్యల గురించి చర్చించినట్లు తెలిపారు. ఈకేసులో పోలీసులు ప్రమేయం ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపినట్లు మోసా అప్పలరాజు తెలిపారు.

CHANGE OF NAME

I, undersigned **Ramadevi Ragothi** (old name) W/o Dona Durga prasad resident Door no 9-4-184/2 Krishna nagar, high School road kotha Gajuwaka Visakhapatnam 530026. Changing my name from **Ramadevi Ragothi** (old name) to **Dona Devi** (New Name) hence forth i am being called has **Dona Devi** (New Name) for all Purpose

వైద్య శిబిరంలో 200 మందికి వైద్యసేవలు

విశాలాంధ్ర - దేవీ పట్నం: శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం శివారు సిరిగిందల పాడులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మఠం మేనేజర్ స్వామీ రఘువీరానందజి మహరాజ్ పాల్గొన్నారు. డా.తలారి వెంకట సుబ్బారావు, డా.దాసరి ఉమా మహేష్, డా. ఎస్.సంపత్ కుమార్ పాల్గొని వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు, అవసరమైన వారికి 74 మందికి రక్తపరీక్షలు, ఒకరికి ఇసిజిలు, తొమ్మిది మందికి థైరాయిడ్ పరీక్షలు, పదిహేను మందికి ఎక్స్ రేలు, పది మందికి ఫిజియథెరపీలు చేసినట్లు స్వామీజి తెలిపారు. రామ కృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ రోగులకు సూచించారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమొను శ్రీనివాస్, వలంటీర్ గాదిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ నిరుద్యోగ పట్టభద్రులకు ఆర్బీకే ద్వారా డ్రోన్ల రుణ సాయం

విశాలాంధ్ర - చింతూరు: గ్రామీణ నిరుద్యోగ పట్టభద్రులకు రైతు భరోసా కేంద్రం ద్వారా డ్రోన్లు రుణ సాయం పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్ నంద్ తెలియజేశారు. ఈ మేరకు ఎర్రం పేటలోని రైతు భరోసా కేంద్రంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులైన గ్రామీణ వ్యవసాయ పట్టభద్రులు డిప్లమా అగ్రికల్చర్ హోల్డర్స్ ఐదుగురు సభ్యులుగా ఏర్పడి ఒక సంఘాన్ని స్థాపించుకొని దరఖాస్తు చేయవలసి ఉందన్నారు. దరఖాస్తుదారుడు తప్పనిసరిగా పాస్‌పోర్టు కలిగి ఉండాలని, అదేవిధంగా డ్రోన్ల కొరకు ముందుగా ఐదు లక్షల రూపాయలు డిపాజిట్ చేసినట్లయితే ఒక యూనిట్ 10 లక్షల రూపాయల విలువైన మందులు పిచికారి చేసే డ్రోన్‌ను పొందవచ్చునని అన్నారు. మరలా తిరిగి నాలుగు లక్షల రూపాయలు రెండు నెలల కాల వ్యవధిలో సబ్సిడీ అందజేయబడుతుందని తెలిపారు. ఈ డ్రోన్ సాయంతో పంటలపై చీడపీడలను తొలగించే పురుగు మందులను త్వరితగతిన పిచ్చికారి చేయవచ్చని అంతేకాకుండా డ్రోన్‌ను ఇతరులకు కిరాయికి ఇచ్చి లబ్ధి పొందవచ్చని ద్వారా వచ్చే సొమ్మును తిరిగి రుణం తీసుకున్న ఖాతాకు చెల్లించవచ్చని తెలిపారు. దీనికిగాను పట్టభద్రులైన వ్యక్తులకు ముందుగా డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఆర్బికే కేంద్రంలోని అగ్రికల్చర్ అధికారులను 8331056252, 7995 086759కు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి ఏ.రమేష్ కుమార్, ఏవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని మొండి గెడ్డ పంచాయతీ మొండి గెడ్డ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో సద్గురు సాయి గురువుల చేతుల మీదుగా అభయాం జనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. విగ్రహాన్ని గ్రామంలోకి చేర్చేందుకు గ్రామస్తులు గబులంగి సత్యనారాయణ, కొండేముల గోవింద్‌లు ఆర్థిక సహాయం అందించారు. ఇదే క్రమంలో గ్రామంలోని రామాలయ అర్చకులు మచ్చల రామారావు, బంగారయ్యల సమక్షంలో విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమానికి అశేషంగా తరలివచ్చిన భక్త జనం భజన, సంకీర్తనలు, ఆట పాటలతో మొండిగెడ్డ గ్రామం మార్మోగింది. వందలాదిగా తరలివచ్చిన భక్తులకు గ్రామస్తులు ప్రసాదం అందించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: బాలింతలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందిస్తోందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వార్డులోని ప్రియదర్శిని కాలనీ, నేతాజీ కాలనీ అంగన్వాడీ సెంటర్లలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణీగా ఉన్నప్పుడు తీసుకునే పోషకాహారం పుట్టే బిడ్డకు కొండంత బలాన్నిస్తుందని చెప్పారు. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకొని జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొదలవలస లోక నాథం, పెద్దింటి మంగునాయుడు, నాగిశెట్టి శ్రీనివాస్, ఎల్వి రమణ, జన సతీశ్, యర్రా సతీశ్, నారాయణ మూర్తి, అప్పారావు, అప్పల నాయుడు, సుందరరావు, రాంబాబు, ఆదిరెడ్డి సురేష్, అడిగర్ల రమణ, అర్జున్, గిరి, అవంతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదానీ పోర్టు నిర్వాసితులకు అఖిలపక్ష నాయకుల సంఘీభావం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గంగవరం పోర్టు (అదాని పోర్ట్) నిర్వాసితులకు అఖిలపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు. పోర్టు నిర్మాణం కోసం భూములు సముద్రాన్ని త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి పోరాడుతుంటే పలు దపాలు సంప్రదింపులు జరిపినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. కనీస జీతం 36000 ఇవ్వమని న్యాయబద్ధంగా కోరుతున్నప్పటికీ ఎటువంటి స్పష్టత యాజమాన్యం నుండి రాకపోవడం దారుణం అన్నారు. నిర్వాసిత కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ కార్మికులను పోర్టు యాజమాన్యం దోచుకుంటుందన్నారు. గంగవరం ఆదాని పోర్టు యాజమాన్యం సంప్రదింపులు ద్వారా నిర్వాసిత కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించుకుంటే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అఖిల పక్షం తరపున విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు, నిర్వాసిత నాయకులు పులి వెంకట రమణారెడ్డి, నిర్వాసిత నాయకులు గోందేశి సత్యారావు, వైఎస్ఆర్సీపీ నుండి గొండేసి మహేశ్వర రెడ్డి, గంట్యాడ గురుమూర్తి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నుండి శ్రీముడసిరి శ్రీనివాసరావు, సుమన్ రెడ్డి, బస అప్పల రెడ్డి, అప్పారావు, గోపి, అప్పలరాజు, తాతారావు, ఏళ్ళాజిరావు, పోలారావు, బాలకృష్ణ, నూకరాజు, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు బీజేపీయే కారణం

విశాలాంధ్ర - చింతపల్లి: మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని నియంత్రించడంలో కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండలంలోని మైనార్టీలు గళ మెత్తారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, చర్చిలను ధ్వంసం, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం తదితర సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా చింతపల్లిలోని ముస్లిం మైనార్టీ లు, క్రైస్తవులు, హిందువులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రజలతో సంఘీభావ శాంతి ర్యాలీ నిర్వహించారు.

వైవీ సుబ్బారెడ్డి కలిసిన బెహరా భాస్కరరావు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎయిర్ పోర్ట్‌లో విశాఖపట్నం అనకాపల్లి విజయనగరం జిల్లాల ఇన్చార్జి, టీటీడీ చైర్మన్ డాక్టర్ వైవీ సుబ్బారెడ్డిని జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల ప్రచారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - చింతూరు: వరదల కారణంగా రహదారులపై నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్తా చెదారం, మురుగునీరు తొలగించే కార్యక్రమంలో చింతూరు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పారిశుధ్య కార్మికులతో పనులు ముమ్మరంగా చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధి కారి టి.కొండలరావు, డీఎల్‌పీఓ రాఘవన్ ఆదేశాల మేరకు ఆదివారం ఏజీహెచ్ఎస్ ఆశ్రమ పాఠశాల, ఎస్ ఎంఎస్ హాస్టల్, బాలుర ఎస్ఎంఎస్ హాస్టల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, గొల్ల బజార్, గుభేలు పేటలో ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నివారణ కార్యక్రమం చేపట్టారు.

రక్తదానం చేయండి.... ప్రాణదాతలుకండి

విశాలాంధ్ర - పెందుర్తి: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు మజ్జి రఘు ఆధ్వర్యంలో ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని చినముషిడివాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు స్వచ్ఛం దంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు కార్పొరేటర్ సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చు అని అన్నారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని విశాఖ బ్లడ్ సెంటర్‌కు అందజేశారు. ఈ శిబిరంలో విశాఖ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు డాక్టర్ బి.వి.ఎ.నాయుడు, వైసీపీ 97వ వార్డు అధ్యక్షులు మెంటి మహేష్, ముచ్చకర్ల దారప్ప, జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు మళ్ళ తులసిరామ్, చిక్కాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దానాలన్నింటిలో గొప్పది అన్నదానం

విశాలాంధ్ర - చింతపల్లి: దానాలన్నింటిలో అన్నదానం గొప్పదని జిల్లా వినియోగదారుల హక్కుల ఆర్గనైజేషన్ బృందం సభ్యుడు దూనబోయిన వెంకటరమణ అన్నారు. చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులు ఒక బృందంగా ఏర్పడి తల్లిదండ్రులు లేని, నిరాశ్రయులైన పిల్లలకు కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రతీ నెలలో 2 రోజుల పాటు అన్నదానం చేయాలని నిర్ణయించారు. ఈ నెల నుంచే ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా ఉన్న నల్లబెల్లి చారిటబుల్ ట్రస్ట్‌లోనూ, బాల సదనం ఆశ్రమ వసతి గృహంలో ఉన్న, తల్లిదండ్రులు లేని పిల్లలకు, అలాగే రోడ్ల మీద ఉంటున్న నిరాశ్రయులకు అన్నదానం చేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అన్ని దానాలలో గొప్పదానం అన్నదానం అని, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులైన పిల్లలకు తమ ట్రస్ట్ ద్వారా రెండు రోజులపాటు అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఐదుగురు సభ్యులం ఒక బృందంగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమానికి సహృదయులైన ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించ వచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు ఇందుగ శేఖర్, ఇమ్మంది మోదగిరి, ఈరెల్లి రాజేష్, గుత్తుల లోవరాజు పాల్గొన్నారు.

గనుల తవ్వకాలపై పంచాయతీలో తీర్మానం చేసేది లేదు

విశాలాంధ్ర - జీకే వీధి: పర్యావరణానికి హాని కలిగించే గనుల తవ్వకాలకు అను కూలంగా ఎట్టి పరిస్థితుల్లోనూ పంచాయతీ పరంగా తీర్మానం చెయ్యమని రింతాడ పంచాయతీ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి అన్నారు. ఆ పంచాయతీ సచివాలయం-1లో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ ప్రజల సారథ్యంలో నల్లరాయి క్వారీ తవ్వకాలకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లరాయి క్వారీ తవ్వకాలు జరిగితే ఆ కొండను ఆనుకొని ఉన్న రింతాడ, తీముల బంధ, ఈదులు బంధ, ఊబపోలం, చిలక వీధి, తోట మామిడి వీధి, ఆసరాడ గ్రామాలతో పాటు చుట్టుపక్కల ఉన్న పది కిలోమీటర్ల వరకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అడవులు, ఊరిన నీటి వల్లే మన గ్రామాలకు మంచినీళ్లు పంట పొలాలకు సాగు నీళ్లు వస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. నల్లరాయి క్వారీని తవ్వితే భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు, తాగునీరుకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేకపోలేదని అన్నారు. క్వారీ బ్లాస్టింగ్ వలన రైతులకు ఆదాయ వనరులైన కాఫీ తోటలు ధూళితో దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా బ్లాస్టింగ్ వల్ల వచ్చే ధూళితో వృద్ధులకు, చిన్నారులకు శ్వాస కోస సంబంధమైన వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ప్రజల శ్రేయస్సు కై నల్లరాయి క్వారీ తవ్వకాలకు వ్యతిరేకంగా తీర్మానం చేస్తున్నామని అన్నారు. ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గనులు తవ్వాలన్నా, నిర్మాణాలు చేపట్టాలన్నా, పిసా చట్ట ప్రకారం పిసా గ్రామసభ పంచాయతీ తీర్మానం లేకుండా ఇటువంటి నిర్మాణం గానీ గనుల తవ్వకాలు గాని జరపరాదని తీర్మానించమన్నారు. చట్టాలను ఉల్లం ఘించి గనుల తవ్వకాలు జరిపినా, తవ్వకాలకు సహకరిస్తే పాలకవర్గం తీర్మానం చేస్తే ప్రజా ప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని ప్రజలన్నారు. గత కొన్ని రోజులుగా ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్ పరిసర గ్రామాలలో పర్యటిస్తూ నల్లరాయి క్వారీ తవ్వకాల వల్ల ఏర్పడే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అప్పల రెడ్డి, ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్, వార్డు సభ్యులు గెమ్మెల పాల్స్, మాజీ సర్పంచ్ సాగిన నడిపి పడాల్, పిసా కమిటీ అధ్యక్షులు వాడెలా పాండురాజు, వైసిపి నేత కంకిపాటి నారాయణరావు, గ్రామస్తులు మడపల వెంకటేశ్వర్లు, సెగ్గే సంజీవ రావు, పోటుకూరి బాలరాజు, కిట్లంగి రమణ, లింగయ్య, రామచంద్రరావు, రఘుపతి, సూరి బాబు, వన్నో, రామ్మూర్తి, మడవల వరలక్ష్మి కిట్లంగి రాజేశ్వరి, మన్యపుత్ర యువజన సంఘం సభ్యులు పాటి నూకరాజు, యువత భాస్కరరావు, కృష్ణ, బుల్లి బాబు జయరాం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో నూతన ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆవిర్భావం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థలో నూతనంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఆవిర్భవించింది. ఆదివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.వి.వామనరావు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షునిగా వి.వి.వామనరావు, అధ్యక్షునిగా టి.శ్రీనుబాబు, కార్యనివాహక అధ్యక్షులుగా ఎస్.కిరణ్ కుమార్, కె.నాగరాజు, వి.సతీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి.వాసుదేవ రావు, బి.వెంకటరావు, పి.సతీష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.జగదీశ్ బాబు, బి. కనకరాజు, డి.వి.చంద్ర శేఖర్, ఒమ్మి సన్యాసిరావు, సంఘటనా కార్యదర్శిగా డింగి మహేష్, సహాయ కార్యదర్శులుగా కే.ఈశ్వరరావు, డొక్కర రామరావులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరందరితో వి.వి.వామనరావు ప్రమాణం చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వి. వి.వామనరావు మాట్లాడుతూ జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యవర్గ సభ్యులకు తమ యూనియన్ తరపున ప్రత్యేక శ్రద్ధతో వారి వెన్నంటి ఉండి పూర్తి సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడి నర్సింగ్, జెమ్స్ అసోసియేషన్ నాయకులు ఎ. అప్పల రాజు, రాజేష్, యూనియన్ నాయకుకులు జి. సీతారాం, ఎల్లయ్య, పోలరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా బోడ కొండమ్మ ఆలయం

విశాలాంధ్ర - చింతపల్లి: నర్సీపట్నం - చింతపల్లి ప్రధాన రహదారి లంబసింగి ఘాట్‌లో కొలువైన బోడ కొండమ్మ ఆలయం పర్యాటక ప్రాంతంగా రూపు దిద్దుకోనుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఆలయ సమీపంలో వ్యూ పాయింట్, అప్రోచ్ సిసి రోడ్డు, టాయిలెట్స్, ఆధునీకరించేందుకు గాను అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి 40 లక్షల రూపాయల ఎంపీ లాండ్స్ నిధులు కేటాయించారు. దీన్ని పురస్కరించుకొని స్థానిక సర్పంచ్ కొర్రా శాంతి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణిలతో కలసి ఎంపీపీ అనూష దేవితో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ బాబు కొబ్బరికాయ కొట్టి నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూష దేవి, మహేష్‌లు మాట్లాడుతూ ప్రకృతి సహజ సిద్ధమైన ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన లంబసింగి పర్యాటక ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేసుకుని బోడకొండమ్మ ఆలయ సమీపంలో ఎంపీ ల్యాండ్స్ నిధులు 40 లక్షలతో నిర్మాణ అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. వ్యూ పాయింట్ నిర్మించి స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టి పర్యటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ డేవిడ్ రాజ్, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, గ్రామ పెద్ద చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, వైసిపి నాయకులు రామ్మూర్తి, గాంధీ, సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ సత్య సాయి బాబా వారి శతజయంతోత్సవాలలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖపట్నం ఆధ్వర్యంలో సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్లు జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఆర్.ఏ.నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని వెల్లంకిలో గల సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో శ్రీ సత్య సేవా సంస్థలు జోన్ విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, సీనియర్ నాయకులు కాకర వెంకటరమణ, ఎంపీటీసీ పడాల అప్పలనాయుడులతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆనందపురం మండలంలో అనేక నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, స్థానిక శ్రీ సత్య సేవా సంస్థల ప్రతినిధి కాకర సురేష్ కుమార్ మాట్లాడుతూ శ్రీ సత్య సేవా సంస్థలు సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో నేత్ర, డెంటల్, క్యాన్సర్, గైనిక్, జనరల్ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 10మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి విశాఖ" ఐ' ఆసుపత్రికి తరలించారు. శ్రీ సత్య సేవా సంస్థలు జోన్ విశాఖ జిల్లా కోఆర్డినేటర్ మానాపురం సత్య సాయి కుమార్, స్థానిక శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రతినిధి కాకర సురేష్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్య క్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు శ్రీ సత్య సాయి సేవా సంస్థలు రాష్ట్ర టెక్నో కోఆర్డినేటర్ ఏ రాంప్రసాద్, జిల్లా మెడికల్ ఇంచార్జ్ సాయికుమార్, జిల్లా స్కిల్ డెవల ప్మెంట్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ప్రశాంతి నిలయం జిల్లా సేవదళ్ కోఆర్డినేటర్ ఎస్ రమేష్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ టి.సూర్య, స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణ రావు, సీనియర్ నాయకులుకాకర వెంకటరమణ, ఎంపీటీసీ పడాల అప్పలనాయుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కంటి మహంతి చంద్రమౌళి, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, విశ్రాంత వీఆర్వో కంటి మహంతి దామోదర్‌రావు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటన చంద్రబాబు నాయుడి కుట్ర

విశాలాంధ్ర - చింతపల్లి: పుంగనూరులో జరిగిన ఘటన వెనుక చంద్రబాబు నాయుడి రాక్షస రాజకీయ కుట్ర దాగి ఉందని చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు కోరాబు అనూష దేవి, బోయిన కుమారి అన్నారు. ఆదివారం వారు చింతపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షురాలు దురియా పుష్పలత, వైకాపా చింతపల్లి, గూడెం కొత్త వీధి మండల అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ్‌తో కలిసి చింతపల్లిలో పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు పార్టీ ప్రచారం కోసం పుంగనూరులో రోడ్ షో కి అనుమతి తీసుకుని, అనుమతి ఇచ్చిన రహదారి మార్గాన గాక, మరో వైపుగా వెళ్ళి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ఘర్షణలకు కారణమయ్యారని వారు ఆరోపించారు. చంద్రబాబు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని, దానిని తూచా తప్పకుండా పుంగనూరులో తెదేపా శ్రేణులు అనుసరించి, తమ స్వామి భక్తిని చాటుకున్నారని దుయ్యబట్టారు. ఈ కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడమే గాక చంద్రబాబుని ఏ1 ముద్దాయిగా పేర్కొంటూ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ అలజడులకు కారణమవుతున్న చంద్రబాబు నిర్వహించే రోడ్ షోలు, బహిరంగ సమావేశాలకు అనుమతులు ఇవ్వరాదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

మణిపూర్ ఘటనపై నిరసనల వెల్లువ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా గాజువాకలోని క్రైస్తవ సంఘాలు ఐక మత్యంగా రాస్తారోకో నిర్వహించి మానవహారంగా ఏర్పడి ధర్నా నిర్వహించారు. వైసిపి నాయకులు రవిబాబు మాట్లాడుతూ మణిపూర్లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి భారతదేశంలోని ప్రతి మహిళపై జరిగిన దాడిగా మనం గుర్తించి నిరసన తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మణిపూర్లో మూడు నెలలుగా జరుగుతున్న ఈ మారణ హోమంలో 175 మంది ప్రాణాలు కోల్పోయారని 60 వేల మంది నిరాశ్రయుల య్యారని ఎన్నో గ్రామాలు ప్రజలు తమ ఊర్లు విడిచి వెళ్లిపోవడం జరిగిందని, ఇలాంటి పరిస్థితి మునిపెన్నడు ఏ రాష్ట్రంలోనూ లేదని ఈ యొక్క మరణ హోమాన్ని ఆపే దిశగా కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్ వెస్లీ మాట్లాడుతూ ఈ

మారణ హోమం వెనుక సామా జిక, ఆర్థిక రాజకీయ కోణాలు ఉన్నాయని భారతదేశ ప్రజాస్వామ్యానికి ఇది హాని కలిగించే అంశమని తెలియజేశారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుని వివాదాన్ని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు.

నేటి ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - కూనవరం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వరద ముంపు గ్రామాలైన కూనవరం పర్యటన సందర్భంగా భారీ ఏర్పాట్లను చేశారు. కోతుల గుట్టలోని హెలిప్యాడ్ వద్ద నుంచి కూనవరం బస్టాండ్ వరకు మూడు కిలోమీటర్ల మేర బారికేడ్లను ఏర్పాటు చేశారు. కాగా అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఏఎస్ఆర్ జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట చేరుకుంటారు. అక్కడ గోదావరి వరదల ప్రభావిత ప్రాంతాలు, సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడిన అనంతరం కూనవరం బస్టాండ్ సెంటర్లో కూనవరం, వీఆర్ పురం మండలాల వరద బాధితులతో సమావేశం అవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి కుక్కునూరు మండలం గొమ్ముగూడెం చేరుకుంటారు. అక్కడ వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలన అనంతరం వరద బాధిత కుటుంబాలతో సమావేశమవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం చేరుకుంటారు. అక్కడ ఆర్అండ్బీ గెస్ట్హౌస్లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం తర్వాత రాత్రికి అక్కడే బస చేస్తారు. తిరిగి మంగళవారం ఉదయం 9.10 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ నుంచి బయలుదేరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గురజాపులంక చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో సమావేశం తర్వాత తానేలంక రామాలయంపేట గ్రామం చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో సమావేశం తర్వాత అయినవిల్లి మండలం తోటరాముడివారిపేట, కొండుకుదురు చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో సమావేశం తర్వాత అక్కడి నుంచి బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

రెడ్మి 12 5జి విడుదల చేసిన షవోమీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశంలో అత్యంత విశ్వసనీయ స్మార్ట్ఫోన్ ఎక్స్ ఏఐఓటీ బ్రాండ్ షవోమీ ఇండియా, భారతదేశంలో 5జి కనెక్టివిటీ కొత్త శకానికి నాంది పలికే దిశగా అత్యంత ముఖ్యమైన అడుగు ముందుకు వేసింది. అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న సరికొత్త నంబర్ సిరీస్ స్మార్ట్ఫోన్ - రెడ్మి 12 5జిను నేడు విడుదల చేసింది. ఈ స్మార్ట్ ఫోను 4జిబి ప్లస్ 128జిబి వేరియంట్ రూ.10,999, 6జిబి ప్లస్ 128జిబి వేరియంట్ రూ.12,499 మరియు 8జిబి ప్లస్ 256జిబి వేరియంట్ రూ.14,499 ఆఫర్లతో పాటు సమర్థ వంతమైన ధరతో అందుబాటులోకి వచ్చాయి. రెడ్మి 12 5జి అనేది స్నాప్డ్రాగన్ 4 జెన్ 2 5జి ప్రాసెసర్ను కలిగి ఉన్న భారతదేశపు మొట్టమొదటి స్మార్ట్ఫోన్ కాగా, ఇది ఫ్లాగ్షిప్-స్థాయి 4 ఎం ఎం ఆర్కిటెక్చర్ను కలిగి ఉంది. ఇది వేగవంతమైన కనెక్టివిటీ కోసం 5జి సామర్థ్యాలను సమర్థవంతంగా అన్లాక్ చేస్తుంది.

గద్దర్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర - దేవరాపల్లి: పాటల యుద్ధనౌక ప్రయాణం ఆగిపోయిందని గద్దర్ మృతి పట్ల బహుజన కళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రజా గాయకుడు కాటపల్లి అప్పారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రజా వాగ్గేయ కారులుగా తెలుగు నేల ఆయనను మరువదన్నారు. చరిత్రలో ఆయన కళా సేవలు మరువలేనివి. నక్సల్స్ ఉద్యమంలోనూ, పౌరహక్కుల ఉద్యమంలోనూ, దళితుల ఉద్యమంలోనూ, తెలంగాణా ఉద్యమంలోనూ గద్దర్ పాత్ర కొనియాడదగినదన్నారు. ఉద్యమాలలో ఎన్నో ఆటుపోట్లును,ఎత్తు పల్లాలను, గెలుపు - ఓటమిలకు ఆయన ప్రత్యక్ష సాక్షి అన్నారు.

ఉత్తమ-శ్రేణి బ్యాటరీతో ఒప్పో ఏ 78 స్మార్ట్ఫోన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఉన్న స్మార్ట్ పరికరాల బ్రాండ్ ఒప్పో నుంచి ఒప్పో ఎ 78 విడుదలను ప్రకటించింది. ఈ హ్యాండ్సెట్ రెండు రంగుల ఫినిష్లో అందుబాటులో ఉంటుంది. ఆక్వా గ్రీన్ ఎ 78 నీటి-ఆకుపచ్చ బేస్ పొరపై ఒప్పో యొక్క మొదటి డైమండ్ మ్యాట్రిక్స్ డిజైన్ను సూపర్ఇంపోస్ డబుల్-లేయర్ ప్రక్రియను ఉపయోగిస్తుందిబీ మిస్ట్ బ్లాక్ వెర్షన్ దాని స్వచ్ఛమైన నలుపు బేస్లో పసుపు-ఆకుపచ్చ స్పర్శతో వస్తుంది. ఇది ఫోన్కు ప్రత్యేకమైన మెటాలిక్ గ్లాస్ను ఇస్తుంది. అల్ట్రా స్లిమ్ రెట్రో డిజైన్,2.5డీ రైట్ యాంగిల్ మిడిల్ ఫ్రేమ్, స్మూత్ చేయబడ్డ అంచులతో ఫోన్ సొగసైనదిగా, పట్టుకోవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన: అరెస్టులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధమైన నేతలు.ఎక్కడికి అక్కడ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులను ముందస్తు హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు. పీఎం పాలెం లో, ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంగము రాష్ట్ర అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ కన్వీనర్ పోలాకి శ్రీనివాసరావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

బీజామృతంపై అవగాహన

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం గిడుతూరు గ్రామంలో ఆదివారం వరలక్ష్మి పొలంలో బీజామృతంతో వరినారు శుద్ధి చేసి నాట్లు వేయడం జరిగింది. కాండం తొలిచే పురుగు కూడా ఆశించదని, వరుస క్రమంలో వరి నాట్లు వేయడం వలన కాలిబాటలు తీయడం వలన దోమ పోటు రాదని, పెద్ద పెద్ద గాలులు వీచినప్పుడు వరి చేను పడిపోకుండా ఉంటుందని వివరించారు. అలాగే ఎరువులు, కషాయాలు స్ప్రే చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. గాలి వెలుతురు బాగా తగులుతుందని, ఇలా చేయడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుదర్శన్, గణపతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి - దేవరాపల్లి మధ్య రహదారిలో మాటు మాను ఐరన్ బ్రిడ్జిని కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న పశ్చిమ గోదావరి నిడదవోలు గ్రామానికి చెందిన పల్లి పింకీ (23), గుడేరు లక్ష్మి(19)లు గాయపడ్డారు. ఆదివారం కావడంతో మారేడుమిల్లి పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వచ్చి తిరిగి వెళు తుండగా ఈ ఘటన జరిగినట్టు తెలి సింది. 108 అంబులెన్స్లో రంపచోడవరం ఏరియా ఆసు పత్రికి తరలించి ఎక్కడి నుండి రాజమండ్రి జిజిహెచ్కు తరలిస్తున్నట్టు సమాచారం.

అక్రమ కట్టడాలపై చర్యలేవి...?

పత్రికల్లో వస్తున్నా అధికారులు పట్టించుకోరా
అధికారుల తీరుపై మండిపడిన వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో గిరిజనేతరులు 1/70 భూ బదలాయింపు చట్టాన్ని ధిక్కరించి విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మించుకుంటున్నా అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానిక మండల వైస్ ఎంపీపీ, గిరిజన సంఘం నాయకుడు సూడిపల్లి కొండలరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న అక్రమ కట్టడాలపై నిత్యం పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురి తమవుతున్న జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారుల్లో కనీసం చలనం లేకపోవడం విచారకరమన్నారు. ఇక్కడి గిరిజన ప్రతినిధులు, నాయకులు కొంతమంది గిరిజనేతరులకు బినామీలుగా మారి అక్రమ కట్టడాలకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో గల మోదమాంబ గుడి మొదలుకొని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల వరకు రోడ్డుకి ఇరువైపులనున్న ఆర్ అండ్ బి ప్రభుత్వ స్థలాల్లో, గ్రామ కంట భూములలో గిరిజనేతరులు అక్రమ శాశ్వత గృహ నిర్మాణాలు, షాపులు నిర్మించుకుంటున్న వాటి నిలుపుదలకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గిరిజనేతరులు మరింత రెచ్చిపోయి విచ్చలవిడిగా నిర్మించుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. గతంలో కొంతమంది గిరిజనులు ఆర్ అండ్ బి స్థలములలో షాపులు నిర్మించుకుంటే హడావిడిగా రెవిన్యూ సిబ్బంది సందర్శించి బోల్డోజర్ సాయంతో తొలగించినా అధికారులు ఇప్పుడు గిరిజనేతరులు అదే ఆర్ అండ్ బి స్థలాల్లో విచ్చలవిడిగా నిర్మిస్తున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ఆయన అధికారులను సూటిగా ప్రశ్నించారు. గిరిజనేతరులు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు మండల వాసుల నుండి విమర్శలు వస్తున్నాయని చెప్పారు. హుకుంపేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో గల పాడేరు జిల్లా కేంద్రంలో నియమింపబడిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కూడా గిరిజనుల భూములు అన్యాక్రాంతం అవుతున్న, 1/70 భూ బదలాయింపు చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కనీసం చలనం లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. ఇప్పటికైనా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అక్రమ నిర్మాణాలపై తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంపై పలుమార్లు స్పందనలో జిల్లా కలెక్టర్, మండల స్థాయి అధికారులకు, ఐటీడీఏ పీఓకు, సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేసిన అరికట్ట డంలో చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా తక్షణమే అక్రమ కట్టడాలను తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చుండూరు దళిత మృతవీరులకు ఘన నివాళి

విశాలాంధ్ర - పాయకరావుపేట: చుండూరు దళిత మృత వీరుల చిత్రపటాలకు దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణస్వరూప్ మాట్లాడుతూ 1991 ఆగస్టు 6వ తేదీన దళిత వాడపై అగ్రవర్ణానికి చెందిన వారు చేసిన దాడుల్లో 11మంది దళితులు హత్యకు గురయ్యారని తెలిపారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. పోలీసులు, రాజకీయ నాయకులు కుట్రలు చేసి బాధితులకు అన్యాయం చేశారని తెలిపారు. ఈ కేసులో హంతకుల మీద ఉన్న హత్య కేసులు కొట్టేశారని తెలిపారు. హత్య కాండ దాడుల పైన సుప్రీంకోర్టులో అప్పీలు వేసినట్లు తెలిపారు. ఈ కేసును బెంచ్కు రాకుండా జగన్ ప్రభుత్వం అడ్డుకుంటుదని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ ఇటీవల తన పుట్టినరోజు చుండూరులో జరుపుకొని భూస్వామ్య సామాజిక వర్గానికి అండగా నిలిచి దళిత జాతికి సవాల్ చేశారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా దళిత జాతిపైన దాడులు, హత్యాచారాలు జరుగుతున్నా అగ్రకుల పాలక ప్రభుత్వం, పోలీస్, కోర్టులు సైతం దళితులకు అన్యాయం చేస్తున్నారని, బాధితులకు రక్షణ కల్పించడం లేదని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలను పాలకులు అమలు చేయడం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని ప్రభుత్వం, పోలీసులు కుట్ర పూరితంగా నీరు కారుస్తున్నారని ఆరోపించారు. పొలిటికల్ పవర్ సాధన తోనే దళిత జాతికి రక్షణ, విముక్తి వస్తుందని, లేకపోతే బానిసత్వం తప్పదని వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, జక్కల సూరిబాబు, చిరుకూరి రమణబాబు, చిరుకూరి అర్జున్రావు, మార్తి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శబరీ గోదావరి నదులు వుప్పొంగి ప్రవహించడంతో, ముంపునకు గురైన గ్రామాల వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది అని వైసీపీ మండల కన్వీనర్, పొడియం గోపాలారావు పేర్కొన్నారు. మండలంలోని వడ్డిగూడెం గ్రామం సచివాలయ పరిధిలో జేసీఎస్ మండల ఇంఛార్జ్ బొడ్డు సత్యనారాయణ, ముత్యాల గౌతమ్ల ఆధ్వర్యంలో పత్రిక సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల శబరి,గోదావరి వరదలు వచ్చి మండల ప్రజలు నాన ఇబ్బందులు పడ్డారని వరదలు వలన ప్రజలు గుట్టలు, చెట్లు, అడవిలో తలదాచుకున్నారని వరద బాధితుల బాధలు చూసిన ఎం ఎల్ సి అనంతబాబు, ఎం ఎల్ ఎ నాగులపల్లి ధనలక్ష్మి ఇక్కడ పరిస్థితులను ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని స్పందించిన ప్రభుత్వం వెంటనే జిల్లా అధికారులను అప్రమత్తం చేయటమే కాకుండా జిల్లా కలెక్టర్, ఐ టి డి ఎ పి ఓ లను ఆయా మండలాలకు పంపించారని అన్నారు. అంతే కాకుండా మండలానికి ఒక ప్రత్యేకాధికారి ని నియమించి మునుపెన్నడూ లేని విదంగా గత ప్రభుత్వాలు చెయ్యని విదంగా వరద బాధితులను హక్కున చేర్చుకొని బాధితులకు నిత్యావసర సరుకులు ఇవ్వటమే కాకుండ సహాయం2000 రూపాయలు అందించారని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, సర్పంచ్ విట్టా రామారావు, సచివాలయ కన్వీనర్లు ముత్యాల శ్రీధర్, చీమల కాంతారావు, రెడ్డిమల్ల శ్రీను తదితరులు హాజరయ్యారు.

జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి ద్వితీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లా కేంద్రంలో గత రెండేళ్లుగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్న జిల్లెళ్లమూడి అమ్మా సేవా సమితి కార్యక్రమాలు అద్భుతంగా చేసారని హిందీ పండిట్ కళాశాల కరస్పాండెంటు,డా.మంచిపల్లి. శ్రీరాములు ప్రముఖ కథారచయిత గంటేడ.గౌరు నాయుడులు తెలిపారు.ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లెళ్ళమూడి అమ్మా సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.ముందుగా జిల్లెళ్ళమూడి అమ్మ చిత్రపటానికి పూలమాల వేసి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంచిపల్లి .శ్రీరాములు మాస్టారూ మాట్లాడుతూ ఒక్కరోజు కూడా విరామం లేకుండా రెండు సంవత్సరాలు అన్న ప్రసాద వితరణ పూర్తి చేసిన అమ్మ కుటుంబం పార్వతీపురం సభ్యులు ధన్యు లని,ఇదిగొప్ప కార్యమని అభివర్ణించారు. గౌరునాయుడు మాట్లాడుతూ ఇది సాహస కార్యమని,అమ్మ ఆశీస్సులతో , నిస్వా ర్థ భావనతో నడుస్తున్న ఈకార్యక్రమం ఇంకా ముందు ముందు కూడా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి పార్వతీపురం అధక్ష ,కార్యదర్శులు గంటేడ సోమేశ్వరరావు, చిన్నంనాయుడులు అమ్మ సేవాసమితి గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న కార్యక్రమాల వివరాలను సభకు వివరించారు.పూర్వ విద్యార్థులు మజ్జి.భాస్కరరావు, మూడడ్ల.ఉమా మహేశ్వరరావు, రంగాచార్యులు,బోరోతు శంకరరావు, కస్తూరిలు జిల్లెళ్ళమూడి అమ్మ తత్వాన్ని,వారి అనుభవాలను,అమ్మతో అనుభూతులను ఎంతో చక్కగా తెలియజేశారు.ముఖ్యంగా వార్షికోత్సవ సభలో జిల్లెళ్ళమూడి కళాశాల పూర్వ ప్రాచార్యులు వి.రామచంద్రమూర్తి రాసిన అక్షరార్చన పుస్తకాన్ని జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి (పార్వతీపురం) సభ్యులు ఆవిష్కరించారు.రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో రైతుబజార్ వృద్ధాశ్రమంలో 200మందికి అమ్మ అన్న ప్రసాదంను అందించారు.దలాయిపేట, కోటిపాం,ఉలిపిరి హైస్కూల్లో పదవతరగతిలో ప్రధములుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకుజి గంటేడ.చిన్నమ్మలు స్మారక ఉత్తమ విద్యార్థి- 2023 పురస్కారాలతోపాటు నగదు బహుమతులను గంటేడ సోమేశ్వరరావు అందజేసారు. ఇటీవల ప్రకటించిన పిజి ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన ముగ్గురు జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల విద్యార్థులకు కూడా జిల్లెళ్ళమూడి అమ్మ సేవాసమితి షీల్డ్,నగదు బహుమతిలను ప్రదానంతోపాటు శాలువాలతో సత్కారం చేశామని సోమేశ్వరరావు, చిన్నం నాయుడులు తెలిపారు. ఈకార్యక్రమంలో జి.సరళ(విశాఖపట్నం) మారుతీబాయి,(విజయనగరం),పార్వతీపురం పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.జగన్నాథంనాయుడు, దొడ్లంకి.గణపతి, అమ్మా సేవా సమితి సభ్యులు,విశ్రాంత ఉద్యోగులు.విశాఖపట్నం, పాలకొండ, ఎస్.కోట ,రాజాం,మక్కువ,శ్రీకాకుళం, బొబ్బిలి , బలిజిపేట తదితర ప్రాంతాల నుండి జిల్లెళ్ళమూడి కళాశాల పూర్వ విద్యార్థులు అనేకమంది తరలివచ్చారు

రాయల్ స్టాగ్ బూమ్బాక్స్ ఒరిజినల్ గీతం 'హూడీ' ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వయాకోమ్ 18 యొక్క సహకార సమన్వయంతో రాయల్ స్టాగ్ బూమ్బాక్స్, బాలీవుడ్ యొక్క సుమధుర సంగీతం భారీ తరం యొక్క ఒరిజినల్ ధ్వనిని సృష్టిస్తూ హిప్ హాప్ యొక్క లోతును పూద్చుతూ సంపూర్ణంగా కొత్త సంగీత కళా ప్రక్రియలను తీసుకురావడానికి సర్వం సిద్ధం చేసుకొంది. సియాగ్రామ్ యొక్క రాయల్ స్టాగ్ కొరకు గణనీయమైన పట్టుదల మూలస్తంభంగా చేస్తూ, సంగీతం తరతరాల ప్రజల వ్యాప్తంగా భావోద్వేగాలను తట్టి లేపుతుంది. ఈ ఆధునిక శకంలో, అద్భుతమైన కొత్త సంగీత కళా రూపాలను అన్వేషించుకునే దిశగా యువ శ్రోతలు చాలా ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. 'లివింగ్ ఇట్ లార్జ్' యొక్క స్ఫూర్తిని సంబరంగా జరుపుకుంటూ మరియు తన విశిష్టమైన క్షేత్ర-స్థాయి అనుభవాలతో మణిపాల్, భువనేశ్వర్, పుణె, ఇండోర్ మరియు డెహ్రాడూన్ లో పరవశించే వేలాది సంగీత ప్రియుల్ని కలిగి ఉంటూ, రాయల్ స్టాగ్ బూమ్బాక్స్ 4 ఒరిజినల్ సంగీత గీతాల ఆవిష్కరణతో తన తర్వాతి దశకు ప్రవేశిస్తోంది. విడుదల చేయబడే అట్టి ఒరిజినల్ సంగీత స్వరగీతిక, బాలీవుడ్ గాయని నికితా గాంధీ మరియు రాపర్ బాలీ డైనమిక్ జంట మధ్య ఒక విశిష్ట సహకార సమన్వయముగా ఉంటుంది.

ప్రజా యుద్ధ నౌక మూగబోయింది

ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు

విశాలాంధ్ర - పెందుర్తి: పీడిత ప్రజల యుద్ధ నౌక గద్దర్ మరి లేరు అనడానికి మాటలు రావడం లేదు అని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. గద్దర్ పరిచయం అక్కర్లేని పేరు, వివరణ అవసరం లేని గౌరవం అని కొనియాడారు. సాధారణ మేస్త్రి కొడుకుగా పుట్టి అసామా న్యుడిగా ఎదిగి అందరి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. గద్దర్ తన జీవన పయనంలో ఎన్నో అడ్డంకులు, మరెన్నో చిత్కారాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తెలుగు నేలలోనే కాక దేశం నలుమూలల తన గాత్రంతో పీడిత ప్రజలను ఉత్తేజపరిచిన ప్రజా గాయకుడు గద్దర్ అని పేర్కొన్నారు. జానపద పల్లె గానం పరిణితి చెంది విప్లవ గీతంగా మారిందని, ఆ గీతానికి పర్యాయ పదమే గద్దర్ అని వెల్లడించారు. ఎంతోమందిలో చైతన్యం తీసుకువచ్చిన ఆ గొంతు మూగబోయిందంటే నమ్మ శక్యంగా లేదన్నారు. అంబేద్కర్ ప్రభావం గద్దర్ తండ్రి పై చాలా ఎక్కువ ఉండేదని, అతని తల్లి ప్రభావం గద్దర్ పై మరింతగా ఉండేదన్నారు. జానపద గీతాలు, ధరలు కళ్ళు తెరిపించే పాటలు ఆయన తన తల్లి దగ్గరే నేర్చు కున్నారని చెప్పారు. ఆయన పాట పాడితే వేలాది గుండెలు చైతన్యవంతమవుతాయి.. ఆయన గొంతు సమూహమని పేర్కొన్నారు. ఆయన పాటల ద్వారానే సామాన్యుల భాష వాడుక భాషగా మారిందని చెప్పారు. కోట్లాది మంది పేదల కష్టాలను నష్టాలను పాటలు రూపంలో వినిపించిన మహోయనీయుడు గద్దర్ అని తెలిపారు. మొట్టమొదట మా భూమి సినిమాలో వెండి తెరపై కనిపించిన గద్దర్ కు, నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మో పాటకు నంది అవార్డు వచ్చిందని వెంకటరావు తెలిపారు. గద్దర్ అకాల మరణానికి చింతిస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు వెంకట్రావు తెలియచేసారు.